నిలయం
3729
శ్రీకాకుళం

# విముక్తి

రాత్రి పదిగంట లవుతోంది. సుల్తాన్ తన గదిలో మంచం మీద దిండుకానుకొని వొరిగి వున్నాడు. రంగు రంగుల లుంగీ, మఖ్‌మల్ కుర్తా వేసుకున్నాడు. పసిమి ఛాయ, తీర్చిదిద్దిన ముఖవర్చస్సు, బుగ్గన తాంబూలం. ఎర్రని పెదవులు—మెర్క్యురీ దీపకాంతిలో అచ్చంగా రాకుమారుని లాగున్నాడు. ప్రక్కనే టేబిల్ పైన ట్రాన్సిస్టరులోంచి క్రికెట్ కామెంట్రీ వినిపిస్తోంది. ఇంగ్లాండుకూ, పాకిస్తానుకూ మధ్య లండన్‌లో జరుగుతోన్న ఆఖరు టెస్టు అది. సుల్తాన్ కళ్ళు మూసుకొని శ్రద్ధగా వింటున్నాడు...

ఎవరో చిన్నగా తలుపు తట్టిన శబ్దం వినిపించింది. కాసేపాగి మళ్ళీ వినిపించింది. దాంతోబాటు గాజుల చప్పుడు కూడ వినిపించింది. ట్రాన్సిస్టర్ వాల్యూం తగ్గించాడు. మూడోసారి స్పష్టంగా వినిపించింది. సుల్తాన్‌కు ఆశ్చర్యం వేసింది, ఇంతరాత్రి తన దగ్గరికి ఆడవాళ్ళు ఎవరొచ్చి వుంటారో అర్థంకాలేదు. "ఎవరూ ?" అన్నాడు గట్టిగానే.

జవాబులేదు. నిశ్శబ్దం.

కాసేపాగి, ఇహ వాల్యూం పెంచుదామనుకుంటూంటే మళ్ళీ గాజుల చెయ్యి తలుపు తట్టిన శబ్దం వినిపించింది. విసుగ్గా, అయిష్టంగా మంచం దిగాడు సుల్తాన్. విసురుగావెళ్ళి గడియతీసి తలుపులు తెరిచాడు. ఎదురుగా షీరీఁ ...

షీరీఁయేనా?... ఎప్పుడూ మాసిన దుస్తుల్లో, రేగిన జుత్తుతో దాసీ జనంలో అనామికగా తిరుగాడే షీరీఁయేనా ఈ పిల్ల?... ఏమిటీ వేషం? ఖరీదైన ఎర్ర సిల్కు శల్వార్, కమీజ్, పలచని ఆకు పచ్చ దుపట్టా, నున్నగా దువ్విన తల, నల్లత్రాచులాంటి పొడుగాటి వాల్జడ, చెవులకి

ఝుంకాలు, కుడిముక్కుకి తెల్లరాయి ముక్కుపుడక, మెడకు ముత్యాలహారం, చేతులనిండా గాజులు, మొహానికి పల్చగా పట్టించిన పౌడరు, కళ్ళకు కాటుక, పెదాలకు ఎరుపురంగు—ఇప్పుడిప్పుడే యవ్వనంలోకి అడుగిడుతున్న వయసు. గదిలోంచి వచ్చిపడ్డ వెలుతురులో అప్సరసలా వెలిగిపోతోంది ... సుల్తాన్ చూస్తున్నవాడు చూస్తున్నట్టు గానే వుండిపోయాడు.

"నువ్వు...నువ్వు షీరీవి కదూ?" అవునన్నట్టు తలూపింది.

"ఎందుకు?...ఎందుకొచ్చావ్?...ఏంకావాలి?"

దించివున్న తల ఇంకా దించింది. ఏదో చెప్పాలని పెదవులు విప్పింది. తెల్లని పలువరుస జిగేలుమంది. కింది పెదవి వణికింది. పెదవులు తిరిగి మూసుకు పోయాయి. మౌనంగా నిలుచుంది.

"ఏంవిటి, చెప్పవేం? ఎందుకొచ్చావ్" రెట్టించాడు సుల్తాన్.

బెదురుగా సుల్తాన్‌కేసి ఒక మారు చూసింది. మళ్ళీ పెదవులు విడి వడ్డాయి, అతికష్టంమీద "బే...బేగం...బేగం సాహెబా" (యజమానురాలు) అనగలిగింది.

"ఊఁ, బేగం సాహెబా...?"

"...వెళ్ళమంది"

సుల్తాన్ షాక్ తిన్నాడు. కళ్ళు పెద్దవి చేసి, "ఏంవిటీ? బేగం సాహెబా నిన్ను...నా దగ్గరికి...?" గట్టిగా అంటున్నాడు. షీరీ చప్పున కుడి చేతిని సుల్తాన్ నోటికడ్డంగా పెట్టింది, భయం భయంగా నలువేపుల చూస్తూ, బెదిరిన పిల్లలా వణకటం చూసి సుల్తాన్‌కు జాలివేసింది. కాని వెంటనే అర్థమైంది, అంతాఅర్థమైపోయింది. అసహ్యం వేసింది. కోపం పొంగుకొచ్చింది.

"ఛీ! పో" అంటూ, షీరీ చేతిని విదిలించికొట్టి, గభాలున తలుపు వేసి, గడియ పెట్టేశాడు సుల్తాన్. మంచం దగ్గరి కెళ్ళి కూరుచున్నాడు. ఇంకా గుండె కొట్టుకుంటూనే వుంది. ట్రాన్సిస్టర్ వాల్యూం హెచ్చించాడు. కామెంట్రీ వింటానికి ప్రయత్నం చేశాడు. కాని అదేం బుర్రకెక్కటం లేదు.

కొంచెంసేపటికి కామెంట్రీ ఆగిపోయింది. ఆ రోజు ఆట పూర్తయింది. కాని ఎంత స్కోరో సుల్తాన్ తెలుసుకునే స్థితిలో లేడు. మనసంతా అల్ల కల్లోలంగా వుంది. ట్రాన్సిస్టరు ఆపేసి లేచి లైటు ఆర్పాడు. అప్పుడు ఆ నిశ్శబ్ద నిశీథిలో వినిపించింది ఎవరో మెల్ల మెల్లగా వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు. తలుపు దగ్గరకెళ్ళి విన్నాడు. అవును, ఏడుపు స్పష్టంగానే వినిపిస్తోంది. షీరీఁ ఇంకా అక్కడే నిలుచుని ఏడుస్తున్నట్టున్నది.

ఇంతలో మరెవ్వరిదో పద సవ్వడి వినిపించింది. మెల్లిగా షీరీఁని లేవనెత్తి వెంటబెట్టుకు వెళ్ళినట్టు తెలుసుకున్నాడు సుల్తాన్ తిన్నగా వచ్చి మంచం మీద వెల్లకిలా పడుకొని కళ్ళు మూసుకున్నాడు.

కాని నిద్ర పట్టలేదు. మరెంతోసేపటి వరకు నిద్ర పట్టలేదు. ఆలోచనలతో, పాత స్మృతులతో బుర్ర వేడెక్కిపోతోంది.

హుఁ, అయితే ఇది తనకూ తప్పదన్నమాట; ఈ పాడు ఆచారం యీ యింటిని ఇంకా వదిలిపోలేదన్నమాట. తాను ఎన్నో కథలు విన్నాడు; కొన్ని కళ్ళారా చూశాడు. ఇప్పటికీ ఎప్పుడైనా జుగ్నూ కంటబడితే మనసు చివుక్కుమంటుంది. ఆ రోజుల్లో జుగ్నూ ఎంత బొద్దుగా, అందంగా, చలాకిగా వుండేది! పేరుకు తగ్గట్టు మిణుగురు పురుగులా మెరిసి పోతూండేది, కిలకిలా నవ్వుతూండేది.

ఆ నవ్వు ఓ రోజు చిన్నన్నయ్య సిరాజ్ గదిలోంచి వినపడగానే చకితుడైనాడు సుల్తాన్. కొద్దిరోజుల్లోనే తేలి పోయింది, సిరాజ్ ఆ అమ్మాయితో ప్రేమకలాపాలు సాగిస్తున్నాడని, అవి కాస్త బాహటంగానే జరుగుతున్నాయని అందరూ చూసి చూడనట్టు వున్నారనీ. బహుశ వాళ్ళ ప్రోత్సాహం కూడావుండి వుంటుందనీ తెలుసుకోగానే ఎక్కడలేని ఆశ్చర్యం కలిగింది సుల్తాన్కు. మరి సిరాజ్ జుగ్నూను పెళ్ళిచేసుకుంటాడా? పెళ్ళి కాకుండానే ఇలా తిరగటం భావ్యమేనా? అన్న జిజ్ఞాసలో పడ్డాడు.

ఆ జిజ్ఞాసలోంచి తేరుకోక పూర్వమే మరో షాక్ తగిలింది. జుగ్నూ

కడుపుతో వున్నట్టనిపించింది. సుల్తాన్‌కు ఆదుర్దా హెచ్చింది. పెళ్ళి కాకుండానే జుగ్నూ పిల్లను కనేస్తుందా? అప్పుడు ఈ ఇంటి పరువూ ప్రతిష్ఠా ఏంకాను? 'ఊహుఁ! అలా జరక్కూడదు. వెంటనే సిరాజ్ జుగ్నూను పెళ్ళిచేసుకోవాలి. అదొక్కటే మార్గం,' అనుకున్నాడు సుల్తాన్.

ఆ సాయంత్రమే చిన్నన్నయ్యగదికి వెళ్ళాడు. సిరాజ్ తాపీగా కూచుని, విలాసంగా సిగరెట్టు కాలుస్తూ చేతనేదో ఉర్దూ పుస్తకం పట్టుకొని కూచుని వున్నాడు. తమ్ముడు గదిలో అడుగు పెట్టగానే ఆశ్చర్యంగా చూశాడు. సర్దుకున్నాడు.

"రా రా, సుల్తాన్! రా...ఎన్నడూ లేంది ఇలా వచ్చావేఁ?" అంటూ ఆహ్వానించాడు సిరాజ్. అట్టే చదువుల్లేని ఆ ఇంట్లో కాస్త బాగా చదువుతోన్న సుల్తాన్ అంటే అందరికీ ఆదరాభిమానాలతో బాటు గౌరవం, జంకూ కూడా వున్నాయి.

సుల్తాన్ అన్నను తేరిపార చూస్తూ నిలుచుండి పోయాడు.

"రా, ఇలా వచ్చి కూచో" మళ్ళీ అన్నాడు సిరాజ్. "ఏవిటి విశేషం?"

సుల్తాన్ వెళ్ళి ఒక కుర్చీలో కూచున్నాడు. ఎలా మొదలెట్టాలో చప్పున తోచలేదు. కొంచెం ఆగి ధైర్యంగా అడిగేశాడు, "అన్నయ్యా! మిమ్మల్నొకటి అడుగుతాను. ఏమీ అనుకోరు కదా?"

"నేనేమనుకుంటానూ? అడిగేయి"

"మీరు...మీరు పెళ్ళెప్పుడు చేసుకుంటున్నారు?"

"నేనా...? పెళ్ళా...?" అనుకోని ప్రశ్న వచ్చేసరికి కాస్త తబ్బిబ్బయాడు సిరాజ్. కాని వెంటనే తేరుకొని చిన్నగా నవ్వాడు. ఎగతాళిగా అన్నాడు, "ఏఁ, నా కోసం ఎవరైనా మంచి అమ్మాయిని చూసి పెట్టావా?"

"నేను చూడటమేఁవిటి, మీరురోజూ చూస్తూనే వున్నారుగా? మనింట్లోనే వుందీ..."

"మనింట్లోనే...? ఎవరబ్బా...?"

"...జుగ్నూ."

"జుగ్నూ...? జుగ్నూకూ నాకూ పెళ్ళా...?అ హ హ్హ హ్హ...?" పెద్దగా ఇంటికప్పు ఎగిరిపోయేట్టు నవ్వాడు సిరాజ్. తికమక పడిపోయాడు సుల్తాన్.

కాస్త తమాయించుకుని అన్నాడు సిరాజ్, "అయితే, సీదాకా వచ్చిం దన్న మాట. భేష్! నువ్వు తొందరగానే పెద్దవాడివై పోతున్నావు...కాని, తమ్ముడూ! నీకింకా ఈ విషయాలు అర్థం కావు. చిన్నవాడివి. ముందు ముందు అన్నీ తెలుస్తాయిలే. ఈలోగా వెర్రివెర్రి ఆలోచనలతో తల పగల కొట్టుకోకు. బుద్ధిగా చదువుకో, వెళ్ళు"

"కాని...కాని అన్నయ్యా!" ఇంకేదో చెప్పబోయాడు సుల్తాన్.

"ఉష్! ఆగు, ఇంకేంచెప్పకు. వెళ్ళి చదువుకో...ఊఁ, వెళ్ళు" మళ్ళీ పుస్తకంలో తలదూర్చాడు, ఇంకేమి మాట్లాడటానికి తావివ్వకుండా.

సుల్తాన్ మెల్లిగాలేచి ఈవల కొచ్చేశాడు. అన్నయ్య మాటలు సం తృప్తికరంగా లేవు. తీరాచూస్తే జుగ్నూతో సాగించేది ప్రేమ వ్యవహారంగా లేదు. పిల్లి ఎలుకతో నడిపే చెలగాటంలాగుంది. చివరకి ఆ అమ్మాయి జీవితం నాశనం చేసేట్టుగానే వున్నాడు. దాన్ని అరికట్టడానికి తానేం చెయ్యాలో తోచలేదు సుల్తాన్‌కి. తీవ్రంగా ఆలోచించాడు. ఆఖరికి ఒక దారి కనిపించింది. వెంటనే జనాన్ ఖానా (అంతఃపురం) లోకి దారితీశాడు.

బేగం సాహెబా గదిముందు షీర( కూచునివుంది. తనని చూడ గానే లేచి నిలుచుంది.

"వెళ్ళు, నేనొచ్చానని అమ్మగారితో చెప్పు" అన్నాడు.

అది లోపలికి తుర్రుమంది. మళ్ళీ కాసేపటికివచ్చి, రమ్మంటున్నా రని చెప్పింది.

సుల్తాన్ లోపలి కెళ్ళాడు. మఖమల్ తివాచీమీద దిండ్ల నానుకొని సుఖాసీను రాలై వుంది బేగం సాహెబా. సుల్తాన్ సలాంచేసి దూరంగా కూచున్నాడు. తల్లి ఆశీర్వదించి, సౌజ్ఞతో దగ్గరకి రమ్మని తన ప్రక్కనే కూచో బెట్టుకుంది. తల నిమురుతూ, "ఏంబాబూ! ఏంకావాలి? పుస్తకాలకి డబ్బేమైనా కావలా?" అంది ఆప్యాయంగా,

"లేదు అమ్మీ, నేనందుకు రాలేదు."

"మరి?"

"అన్నయ్య... సిరాజ్ అన్నయ్య గురించి..."

"ఏమైందీ?... సిరాజ్ నిన్నేమైనా అన్నాడా?"

"అదికాదు అమ్మీజాన్!... సిరాజన్నయ్య పెళ్ళెప్పుడు చేస్తారూ?"

"ఓ అదా... ?" మందహాసంగా అన్నది తల్లి. "చేస్తాంలే, త్వరలోనే చేస్తాం."

"నిజంగానా అమ్మీ?" ఆశగా అడిగాడు, "త్వరలోనే చేస్తారా"?

"చేస్తాం. ఎన్నో సంబంధాలు వస్తున్నాయి. వాటిలో మంచి సంబంధం చూసి..."

గతుక్కుమన్నాడు సుల్తాన్. "అదేవిటి అమ్మీజాన్! సిరాజన్నయ్యకు బైటి సంబంధం చూస్తారా?"

"మరి?"

"ఇంట్లోనే వుందిగా?"

"ఎవరూ?"

"జుగ్నూ"

బేగంసాహెబా ఉలిక్కిపడ్డది. "ఏవిటి? జుగ్నూతో సిరాజ్‌కు పెళ్ళా ... నీకేమైన మతిపోయిందా సుల్తాన్? ఒక దాసీ, మన చెప్పుల దగ్గర పడుండే బానిస, దాంతో నా కొడుక్కి పెళ్ళా?"

"కాని అమ్మీ! రోజూ అన్నయ్య...

"ఊఁ, ఏం చేస్తున్నా దేఁవిటి?"

"...జుగ్నూ ... జుగ్నూ అన్నయ్యా గదిలోకి వెళ్తూ వుంటుంది,"

"వెళ్తే ఏఁ? దాసీలు ఎక్కడ పని వుంటే అక్కడికి వెళ్తారు. నీ గదిలోకి మాత్రం రావడంలేదా?"

"అదికాదు అమ్మీ! ... జుగ్నూ గర్భం ..."

"సుల్తాన్!!..." ఒక్కసారి గర్జించింది బేగం. ఆమె కళ్ళల్లో కోపమూ, ఆశ్చర్యమూ మిళితమై వున్నాయి. సుల్తాన్ హడలిపోయాడు. తల్లి నెప్పుడూ అలా చూళ్ళేదు. ఆ చూపులు భరించలేక తల దించేసుకున్నాడు.

"పాడుముండ! దానిపని పడ్తానుండు" అంటోంది తల్లి. కాస్త తగ్గి, "సుల్తాన్ బేటే! నువ్వెళ్ళి చదువుకో. అనవసరమైన విషయాలగురించి ఆలోచించకు" అంటూ వీపు తట్టింది.

మారు మాట్లాడకుండా లేచి వచ్చేశాడు సుల్తాన్. అమ్మ సిరాజన్నయ్యని ఒక్కమాట అనకపోగా జుగ్నూనే చివాట్లు ఎందుకు వేసిందో ఎంత గింజుకున్నా అర్థంకాలేదు.

వారం తిరక్కుండా జుగ్నూ ఇంట్లోంచి మాయమైంది. ఎటు వెళ్ళిందో, ఎందుకు వెళ్ళిందో తెలీలేదు. ఇతర దాసీలని అడిగితే ముసి ముసి నవ్వులు నవ్వుతూ జవాబివ్వకుండా తప్పించుకున్నారు. సిరాజన్నయ్యా ఎప్పటిలాగే ఖుషీగా తిరుగుతున్నాడు.

మరో నెలలోగానే సిరాజన్నయ్యకు పెళ్ళి కుదిరింది. ఆరిఫ్ నవాబ్ కూతురు జులేఖాతో బ్రహ్మాండంగా పెళ్ళి జరిగిపోయింది. చిన్నవదిన జులేఖాను మొట్ట మొదటసారి చూసినప్పుడు చప్పున జుగ్నూ జ్ఞాపకం వచ్చింది. పెళ్ళికూతురు వేషంలో పుత్తడి బొమ్మలా కనిపించిన జులేఖా కంటే నిరాడంబరంగా వుండే జుగ్నూయే అందంగాకనిపించింది సుల్తాన్‌కు. పాపం! ఎక్కడుందో? ఏంచేస్తుందో? అసలు బ్రతికివుందో, లేక అన్నయ్యా

చేసిన అన్యాయాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకుందేమోనన్న తలంపు రాగానే సుల్తాన్ అమాయక హృదయం జాలితో నిండి పోయింది.

ఆరు నెలల తర్వాత అకస్మాత్తుగా ఒకరోజు జుగ్నూలాంటి మనిషి మళ్ళీ కనిపించగానే దిగ్భ్రమ చెందాడు సుల్తాన్. ఆమేనా కాదా అని తేరి పార చూశాడు. ఆమే, కాని మారిపోయింది, పూర్తిగా మారిపోయింది. పూర్వపు నిండుతనం, హుందాతనం, చురుకుదనం అన్నీ హరించుకు పోయాయి. పీల్చి పిప్పిచేసినట్టుగా బక్కచిక్కిపోయి, జీవచ్ఛవంలాగుంది, మొహంలో కళ లేదు. కళ్ళల్లో మెరుపేలేదు.

మరుసటిరోజు మధ్యాహ్నం, అందరూ విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు సుల్తాన్ గది కిటికీగుండా ఒక దృశ్యం చూశాడు. ఇంటి వెనుకతోటలో ఒక చెట్టుకు ఆనుకుని ఎటో చూస్తూ ఒంటరిగా నిలుచుని వుంది జుగ్నూ. సుల్తాన్ ఆమె కంటపడకుండా వెనుకనుంచి దగ్గరగా వెళ్ళాడు, ఆమె చూపులు సిరాజన్నయ్య గదివేపుకే వున్నాయని గమనించాడు. మెల్లిగా "జుగ్నూ భాభీ!" అన్నాడు.

ఆమె ఉలిక్కిపడి వెనక్కుతిరిగి గాబరాగా అటూ ఇటూ చూసింది. "మీరు.. భాభీ అని పిలిచారా?" కట్టలు తెగినట్టుగా కన్నీటిధారలు ప్రవహించాయి. "వొద్దు...వొద్దు నవాబ్ ! నన్నలా పిలవొద్దు, ఎవరయినా వింటే నా చర్మం వలిచేస్తారు, వెండి... వెండి" అంటూనే పారిపోయింది. నిశ్చేష్టగా నిలుచుండిపోయాడు సుల్తాన్.

ఆ తర్వాత సుల్తాన్‌కు చాలా విషయాలు తెలిశాయి. నవాబుల ఇళ్ళలో దాసీలను ఆటవస్తువులుగా వాడుకునే ఆచారం పూర్వంనుంచీ వస్తూన్నదేననీ, చిన్నన్నయ్యకు ముందు పెద్దన్నయ్యకోసం కూడా ఒక దాసీది ప్రత్యేకించబడి వుండేదనీ, అది అన్నయ్య ప్రసాదించిన శిశువును కనలేక ప్రసవవేదనలోనే ప్రాణాలు కోల్పోయిందనీ విన్నప్పుడు సుల్తాన్ మనసంతా జుగుప్సతో నిండిపోయింది. తాను మాత్రం ఈ అనాచారానికి తల

వొగ్గకూడదని దృఢనిశ్చయం చేసుకున్నాడు. అసలు ఈ వాతావరణమే అసహనంగా తోచి, పట్టుబట్టి, పై చదువుల కోసం ఆలీఘఢ్ వెళ్ళిపోయాడు.

ఇంటికి వచ్చినపుడల్లా జుగ్నూను గమనిస్తూనే వుండేవాడు. రాను రాను చాలామట్టుకు కోలుకున్నట్టు అనిపించేది. కాని పూర్వపు హుషారు గానీ, కళ గానీ తిరిగిరాలేదు. ఏదో నిర్లిప్తంగా, యాంత్రికంగా తన పనులు తానుచేసుకుంటూ కనిపించేది. సుల్తాన్ ఎదురుపడితే మాత్రం తొట్రుపాటు పడుతూ, తప్పించుకు వెళ్ళిపోయేది. ఆఖరికి ఆమెను చిన్నవదిన జులేఖా కొలువులో వేశారని తెలిసి అమిత బాధపడ్డాడు సుల్తాన్.

ఈసారి చదువు పూర్తిచేసుకునే ఇంటికి వచ్చాడు. సుల్తాన్ 'ఇస్లామిక్ చరిత్ర'లో ఎం.ఎ. చేశాడు. యూనివర్శిటీ కంతకీ ఫస్టుగా పాసయ్యాడు. వచ్చేముందు అక్కడే లెక్చరర్ ఉద్యోగానికి దరఖాస్తు కూడా పెట్టి వచ్చాడు. ఈ విషయం అన్నలకుగాని తల్లికిగాని చెప్పలేదు. వచ్చిన నాలుగో రోజు రాత్రికే షీరఁ సంఘటన – అది తనగదికి రావటమూ, తాను తిరస్కరించటమూ జరిగింది....

ఈ గతాన్నంతా నెమరు వేసుకుంటూ పడుకున్న సుల్తాన్ నిద్ర పూర్తిగా ఎగిరిపోయింది. మాటిమాటికీ షీరఁ ముగ్ధమనోహర వదనం కళ్ళెదుటికొస్తోంది.... ఏంచేయాలో తోచటంలేదు. కాని ఏంచెయ్యకూడదో తెలుసు. తాత తండ్రుల్లాగా, అన్నయ్యలాగా, తాను దిగజారిపోకూడదు. ఆ అమాయకురాల్ని ఈ ఇంటి పైశాచిక ఆచారాలకు, పశుత్వానికి బలి ఇవ్వకూడదు, ఇవ్వలేడు, ఇవ్వడు, ముమ్మాటికీ ఇవ్వడు. దానికి ఒక్కటేమార్గం. తానీ ఉచ్చులోంచి విడిపడి పారిపోవాలి. ఎక్కడికైనా సరే, పారిపోవాలి. ఇలా అనుకున్నాక సుల్తాన్ మనస్సు కాస్త కుదుటపడ్డది; మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు.

"హలో ప్రొఫెసర్ ! నేను రావచ్చా?" అంటూ చిన్నక్కయ్య ఫరీదాభర్త షౌకత్‌మిర్జా గదిలో కొచ్చాడు. సుల్తాన్ మేనమామ కొడుకు

షౌకత్‌మిర్జా. తమకులానే, వాళ్ళకూ ఒక చిన్న జాగీరు వుండేదీ. ఒక్కడే కొడుకు. అతిగారాబంగా పెరిగాడు. చిన్నప్పుడే తండ్రి పులివేటలో చనిపోయాడు. గారాబం మరీ పెరిగింది. దాంతో అన్ని వ్యసనాలూ అలవడ్డాయి. చదువు అబ్బలేదు. జల్సారాయుడుగా తిరుగుతూ వుండేవాడు. హైద్రాబాదు నగరంలోని మహబూబ్‌కీ మెహెందీ (సావిహాడ)లో అతను తిరగని 'కోఠా' (మిద్దె)లేదని ప్రతీతి. అపుడపుడు తాగుతాడటకూడాను. ఫరీదా పుట్టినప్పుటినుంచే మీర్జా కివ్వాలని అనుకున్నారట. కాని సుల్తాన్ నాన్నగారికి ఇష్టం లేదు. ఆయన బ్రతికే వుంటే బహుశా పెళ్ళి కానిచ్చేవాడు కాదేమో! కానీ, అమ్మ మాత్రం తన మేనల్లుడికే ఇవ్వాలని పట్టుబట్టి పెళ్ళి చేయించింది.

సుల్తాన్‌కు మిర్జా బొత్తిగా నచ్చేవాడుకాదు. అతని ప్రవర్తనవల్ల చిన్నక్కయ్య ఎంత బాధపడుతూన్నదోనని విచారించేవాడు. కాని ఆమెలో అలాంటి సూచనలేవీ కనిపించేవికావు. మహబూబ్‌కీ మెహెందీకి అలవాటు పడ్డ మీర్జా తన వూళ్ళోకంటే హైదరాబాదులో అత్తవారింట్లోనే ఎక్కువ కాలం వుండేవాడు. దాంతో ఫరీదాకూడా దాదాపు ఎప్పుడూ పుట్టింట్లోనే వుంటూ వుండేది. బహుశా అదేనేమో తల్లీ కూతుళ్ళకు పెద్ద సంతోష కారణం.

మీర్జా లోపలికి రాగానే గది తలుపులు వేసేశాడు. సుల్తాన్ ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాడు. మీర్జా మరో కుర్చీ లాక్కొని బావమరిది దగ్గరగా కూచున్నాడు.

"ఏమిటోయి, నువ్వు చూడంగానే ప్రొఫెసర్‌వై పోయేట్టున్నావే? ఎం.ఏ. అయిపోయిందటగా ? ఏం చెయ్యదల్చుకున్నావ్ ?"

"ఇంకా ఏమీ ఆలోచించలేదు" ముక్తసరిగా జవాబిచ్చాడు సుల్తాన్.

"అదిసరేగాని, నేనొకటి చెప్పనా?"

ఏమిటన్నట్టు చూశాడు సుల్తాన్.

"నీ పేరు తప్పుగా పెట్టారోయ్ మీవాళ్ళు"

"ఏం"

"సుల్తాన్ అంటే అర్థమేమిటి? రాజు, రారాజు. కాని నీలో ఆ లక్షణాలు బొత్తిగాలేవే!"

"అంటే?"

"...నిన్నరాత్రి లడ్డూలాంటి అమ్మాయి గదిలోకి వస్తే వొద్దని తరి మేస్తావా?"

సుల్తాన్ బిగుసుకుపోయాడు. ముఖ కవళికలు గంభీరంగా మారిపోయాయి. కొంచెంసేపు మౌనంగా కూమని అన్నాడు, "చూడండి షౌకత్ భాయ్! మీభావాలు నాభావాలు సమాంతర రేఖలు, ఎక్కడా కలవవు. వాదించి లాభమేమిటీ?"

"నాసంగతి కాదోయ్! మీ అమ్మగారూ, అక్కయ్యా ఎంత బాధ పడుతున్నారో తెలుసా?"

"వాళ్ళు బాధపడుతున్నారా? ఎందుకూ?"

"నువ్వు మన వంశ మర్యాదలు పాటించనందుకు"

"ఓహూ! . . అయితే ఇదంతా అందరూ కలిసి చేసిన గూడుపుఠానీ అన్న మాట"

"మరింకేమనుకున్నావ్? దాన్ని తమ వూరినుండి తెచ్చి, ఇన్నాళ్లూ నీకోసం పెంచి పెద్దచేసింది మీ అమ్మగారు కాదూ? నిన్నరాత్రి దాన్ని అంతగా అలంకరించింది ఎవరనుకున్నావ్? మీ అక్కయ్యే"

బావగారి కళ్ళల్లోకి నిశితంగా చూస్తూ నిబ్బరంగా అన్నాడు సుల్తాన్ "షౌకత్ భాయ్! అమ్మకూ, అక్కయ్యకూ నిజంగానే అంత ఇష్టం వుంటే, ఒకపని చేస్తారేమో కనుక్కుంటారా?"

"ఏమిటి?"

"... షీరాతో నాపెళ్ళి జరిపించమని చెప్పండి"

"పెళ్ళా?... అహ్హహ్హహ్హ!..." అచ్చంగా ఆనాడు సిరాజ్ నవ్వినట్టే నవ్వాడు మీర్జా. కాస్త తమాయించుకుని మళ్ళీ అందుకున్నాడు,

"నువ్వు భలే వాడివోయ్! అవునులే, ఒకప్పుడు జుగ్నూ గురించి కూడా నువ్వు ఇలాగే అన్నావట. ఆ ముండ ఇప్పుడెక్కడుందీ? ఉండవలసినచోటే వుంది."

"షౌకత్ భాయ్! కాస్త మర్యాదగా మాట్లాట్టం మంచిది."

"మర్యాదా?... దాసీముండకు మర్యాదేమిటోయ్?... ఏం, నువ్వూ కన్ను వేశావేమిటి?"

"షౌకత్‌భాయ్!" సుల్తాన్ కోపంగా అరిచాడు

"అరె, అలా అరుస్తావెందుకూ? అదేం పత్తిత్తకున్నావా? నేనూ నాలుగు సార్లు రుచిచూశాలే."

ఒక్కసారి లేచి నిల్చున్నాడు సుల్తాన్. "వెళ్ళండి! నాగదిలోంచి తక్షణం వెళ్ళండి. ఇంకెప్పుడూ రావొద్దు. మర్యాద దక్కదు. ప్లీజ్! గెట వుట్!" అంటూ పెద్దగా అరిచాడు.

"సరేలే, నాకై నేనేం రాలేదు. మీ అక్కయ్య పంపిస్తే వచ్చాను" అంటూ జారుకున్నాడు మీర్జా.

సుల్తాన్ దభీలున తలుపు వేసుకొని, రొప్పుతూ వచ్చి మంచంమీద చతికిల బడ్డాడు.

ఊహుఁ, ఇంక ఈ విషపూరిత వాతావరణంలో వుండలేడు. బయట పడాలి. కాని, ఎలా?... తీవ్రంగా ఆలోచించాడు. ఒకే ఒక్క ఆశాకిరణం కనిపించింది. వెంటనే లేచి గబగబా వుత్తరం రాశాడు, ఆలీగఢ్‌లోని తన ప్రొఫెసర్‌కు-తనకు అర్జంటుగా వుద్యోగం కావాల్సి వుందనీ, తాను పెట్టుకున్న దరఖాస్తు విషయంలో సహాయ పడాలనీ ప్రాధేయపడుతూ రాశాడు.

సుల్తాన్ తిన్నగా చిన్నక్కయ్య ఫరీదా దగ్గరి కెళ్ళాడు. ఆమె గదిలో ఒక్కర్తే కూర్చొని ఏదో పుస్తకం చదువుకుంటోంది.

"ఫరీదా బాజీ!" అంటూ గదిలో కెళ్ళాడుసుల్తాన్. ఫరీదా తలెత్తి తీక్షణంగా చూసింది తమ్ముడికేసి.

"షౌకత్‌భాయ్ లేరా బాజీ?"

"ఎందుకూ? ఇంకా ఏమైనా మిగిలుందా ?"

"కాదు బాజీ ! ఏదో నోరు జారింది, బావగారిని అవమానపరిచాను. అందుకు చింతిస్తున్నాను. క్షమాపణ వేడుకుందామనే వచ్చాను."

"నిజంగానా?"

"అవును బాజీ !... నిన్న రాత్రి కూడా నేను మూర్ఖంగా ప్రవర్తించాను. నువ్వూ, అమ్మ నన్ను క్షమించాలి. వస్తా" అంటూ ఓ మాటు అక్కయ్య కళ్ళలోకి చూశాడు. ఆమె ప్రసన్నంగా మారటం గమనించి, తృప్తిగా వచ్చేశాడు.

రాత్రికి తలుపులు ఓరగా వేసి, నిరీక్షిస్తూ కూరుచున్నాడు. సరిగ్గా పదింటికి తలుపు దగ్గర గాజుల చప్పుడైంది.

"ఎవరదీ? .. లోపలకు రావచ్చు" అన్నాడు సుల్తాన్ సౌమ్యంగా.

తలుపు కొద్దిగా తెరుచుకుంది. షీరఁ తొంగిచూసి మళ్ళీ వెనక్కి తగ్గింది.

"షీరఁ ! నువ్వేనా ?... వచ్చేయ్, అలా జంకుతావేం ?"

షీరఁ లోపలకు అడుగు పెట్టింది. అక్కడే తలవంచుకుని నిలుచుంది.

"రా తలుపు గడియవేసి, ఇలా వచ్చేయ్"

నిజంగానేనా అన్నట్టు ఓ మాటు చూసి, షీరఁ తలుపు బంధించి, మెల్లమెల్లగా వచ్చి, రెండు అడుగులు దూరంగా నిలుచుంది. సుల్తాన్ తేరి పార చూశాడు. ఈ రోజు అలంకరణ నిన్నటికంటే గుమ్మగా వుంది.

"ఆగిపోయావేఁ? ఇలావచ్చి కూచో" అంటూ తన ప్రక్కనే, మంచం మీద చోటు చూపించాడు. షీరఁ వచ్చి కూచుంది.

చుబుకం క్రింద వేలుంచి తలపైకెత్తి ఎడం చేతితో తలపైని దుపట్టాను వెనక్కి తొలగించి, "ఏదీ, ఇటుచూడు" అన్నాడు.

షీరఁ చూడ్లేదు. కళ్ళు మూసుకుంది. పెదవులు వణుకుతున్నాయి. సుల్తాన్ ముందుకు వంగి ఆ పెదవులు సున్నితంగా చుంబించాడు అంతే,ఇక

ఆగలేక షీరఁని అమాంతంగా తన హృదయానికి హత్తుకున్నాడు ...

ఆ తర్వాత షీరఁ ప్రతిరాత్రీ వచ్చింది. ప్రతి రాత్రీ స్వర్గసీమలో విహరించారు. .....

పదోరోజున అలీఘఢ్ నుంచి ఉత్తరం వచ్చింది. ప్రొఫెసర్ రాశాడు. సుల్తాన్ దరఖాస్తు మంజూర్ అయిందనీ, ఆర్డర్ వెయ్యబోతున్నారనీ. తాను వెంటనే వచ్చి డ్యూటీలో జాయిన్ కావచ్చనీ వుంది. సుల్తాన్ సంతోషానికి అవధుల్లేవు. వెంటనే తల్లి దగ్గరకు పరుగెత్తాడు. "అమ్మీజాన్ !" అంటూ లోపలికెళ్ళాడు.

బేగం సాహెబా మంచంమీద ఒరిగివుంది. షీరఁ కాళ్ళు పడులోంది.

సుల్తాన్ తీక్షణంగా చూస్తూ, "షీరఁ ! నువ్వెళ్ళు" అని గద్దించాడు. షీరఁ భయంగా చూస్తూ బయటికి పారిపోయింది. బేగం లేచి కూచుంది. కొడుకు సంతోషం పట్టలేకుండా వున్నాడని గ్రహించింది. "ఏఁవిటి సుల్తాన్! అంత సంతోషంగా వున్నావు, ఏఁవిటి విశేషం ?" అని అడిగింది.

"ఏఁవిలేదు అమ్మీ !" అంటూ తల్లికి దగ్గరగా కూచున్నాడు. "మిమ్మల్నొకటి అడగాలని వచ్చాను."

"అడుగు. దానికేఁ ?"

"నాకు - నాకు పెళ్ళెప్పుడు చేస్తారు ?"

'పెళ్ళా?.. నీకా ?" ఆశ్చర్యంగా, అనుమానంగా చూస్తూ వుండి పోయిందిబేగం.

"అవును అమ్మీ! నేను తొందరగా పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను."

ఇంకా అనుమానం వేసింది బేగంకు. "ఎవర్ని ? . ఎవర్ని చేసుకోవాలనుకుంటున్నావు ?

"ఎవర్నో, నాకేం తెలుసు అమ్మీ ? మీకు నచ్చిన అమ్మాయిని ఎవర్ని కుదిర్చినా చేసుకుంటాను" అన్నాడు సుల్తాన్ అమాయకంగా.

బేగం మనసు కుదుటపడ్డది. "అంతేకదా ?" అంది.

"మరింకే మనుకున్నారు అమ్మీ ?"

"ఏమో.. సిపిచ్చిలో షీరం..."

"ఛ ఛ ! దాసీదాన్ని పెళ్ళి చేసుకుంటానా అమ్మీ ? మనకు సరితూగే కుటుంబంలోని అమ్మాయినే చేసుకుంటాను,"

"ఓ దానికేం, ఎంతోమంది వున్నారు. దూరమెందుకూ, మీ షౌకత్ ఖాయ్ చెల్లెలే వుంది."

"మీరు ఎవర్ని కుదిర్చినా చేసుకుంటాను, కాని తొందరగా స్థిర పర్చండి."

"సరేలే! అయినా, ఏమంత తొందర ?"

"తొందరే అమ్మీ ! నా చదువుపూర్తి అయిపోయిందిగా ? ఇక పెళ్ళిచేసుకుని స్థిరపడి పోవాలనుకుంటున్నాను."

"మంచిదే, అలాగే కానీయ్."

".. అమ్మీజాన్! ఇంకొక్క కోరిక."

"ఏంవిటి ?

"ఇన్నాళ్ళూ చదువులోనే పడివున్నాను. ఎక్కడికీ వెళ్ళలేదు. ఇప్పుడు నాలుగుచోట్ల తిరిగిరావాలని వుంది,"

"ఎక్కడికెళ్తావు.?"

"ఆగ్రా, అజంతా, ఎలోరా "

"వెళ్ళిరా, దానికేం?"

".. మీరు అనుమతిస్తే, షీరంనికూడా వెంటపెట్టుకు వెళ్తాను."

"షీరంనా? ఛ ఛ! దాసీదానివెంట తిరుగుతావా? ఎంత అప్రతిష్ఠ!"

"అమ్మీ! అది మనింట్లో దాసీది. బయట వూళ్ళలో ఎవరికి తెలుస్తుంది ?"

"పెళ్ళయాక భార్యనే వెంటపెట్టు కెళ్ళరాదూ ?"

"అప్పుడు కాశ్మీర్ కెళ్తాం. నెల రోజులుంటాం. ఈ లోగా దగ్గరి ప్రదేశాలకి వెళ్ళనివ్వండి అమ్మీ! ఈ ఒక్క కోరిక కాదనకండి ! "

"సరే, వెళ్ళు.. డబ్బెంతకావాలి ? రెండువేలు సరిపోతుందా ?"

"ఓ, చాలు. పదిరోజుల్లో తిరిగిరామూ ?"

సుల్తాన్ ఆలస్యం చెయ్యకుండా ఆగ్రాకు రెండు బెర్తులు రిజర్వ్ చేయించాడు. తన బట్టలు, షీరీ బట్టలూ రెండు సూటుకేసులో సర్దించాడు. మూడోరోజే షీరీని తీసుకుని ప్రయాణం కట్టాడు. కాని ఆగ్రాలో ఆగలేదు. ఢిల్లీ వరకు పొడిగించి, అక్కణ్ణించి అలీగఢ్‌కి దారితీశాడు. మరో పదిరోజులకు తల్లికి ఉత్తరం రాశాడు.

"అమ్మీజాన్! పాదాభివందనాలు. క్షమించాలి. మీరు సమ్మతించలేని రెండు పనులు నేను చేశాను. ఒకటి, దినదినం క్షీణిస్తోన్న మన నవాబు కుటుంబాల కృత్రిమ వాతావరణం నించీ, జుగుప్సాకరమైన ఆచారాలనించీ, నికృష్టభావాలనించీ దూరంగా పారిపోయి వచ్చేశాను, శాశ్వతంగా వచ్చేశాను. నాకోసం వెతకడానికి వృథా ప్రయాసచెయ్యకండి. నేను రాను గాక రాను.

ఇక రెండవది. నేను ఇక్కడే పెళ్ళి చేసేసుకున్నాను. వధువు మరెవ్వరో కాదు. మీరు ప్రేమతో పెంచి పెద్దచేసి నాకు అప్పగించిన షీరీయే. షౌకత్‌ఖాన్ చెల్లెల్నిగాని, మరో నవాబుల అమ్మాయినిగాని నేను చేసుకునివుంటే, కృత్రిమ వాతావరణంలో పెరిగిన ఆ అమ్మాయి నాకు అనుకూలవతి అయిన భార్యగా రూపొందేదన్న ఆశ నాకు ఏ కోశానా లేదు. షీరీ ఉత్త అమాయకురాలు. నాకు అనుకూలంగా ఎలా మలుచుకున్నా అలా తయారవుతుందన్న గట్టి నమ్మకం నాకుంది. మాది ఆదర్శదాంపత్యంగా పరిణమించగల దనటంలో సందేహం లేదు.

అమ్మీజాన్! నేను మీకు ప్రియమైన ఆఖరి సంతానాన్ని. ఆ ప్రేమాదరాలతోనే నన్ను క్షమిస్తారని ఆశిస్తున్నాను. ఏనాటికైనా మీరు షీరీని కూడా హృదయపూర్వకంగా మీ చిన్నకోడలుగా గుర్తిస్తారని ఆశ. ఆనాడే మేమిద్దరం మీ ఆశీస్సులకై మీ దగ్గరికి రాగలము. అంతవరకు దూరాన్నించే మమ్మల్ని దీవించండని ప్రార్థిస్తూ—

ఇట్లు
మీ ప్రియమైన చిన్నకొడుకు
సుల్తాన్"

(స్వాతి-ఆగస్టు '80)